క్లుప్తంగా

సౌండ్ బాక్సుల వితరణ
బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు రూ. 20 వేల విలువ చేసే సౌండ్ బాక్సును బుధవారం అందించారు. పూర్వ విద్యార్థులను పాఠశాల హెచ్ఎం నరేందర్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్సెమ్సీ ఛైర్మన్ శ్రీమాన్, పూర్వ విద్యార్థులు దత్తాద్రి, వాణి, నవీన్, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు..
రుద్రూర్: అంబం(ఆర్) ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు టీచర్ జగ్గరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం టై, బెల్ట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బంగారు భవిష్యత్తు కోసం కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ అధ్యక్షులు పాపయ్య, సాయిలు, ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం పాల్గొన్నారు.

రాగిజావ అందజేత
పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో రాగిజావ అందజేశారు. స్థానిక సర్పంచ్ మచ్చర్ల పూజిత కిశోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రాగిజావ అందజేసే కార్యక్రమాన్ని పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఐరన్ శాతాన్ని పెంపొందించడానికి సత్యసాయి ట్రస్టు వారు రాగిజావను అందజేయడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీలు ఎంసీ గంగా రెడ్డి, మహేందర్, పాఠశాల హెచ్ఎం రఘుపతి పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన
కమ్మర్‌పల్లి: అమీర్‌నగర్‌లో సాగవుతున్న వరి పంటలను భీమ్‌గల్ ఏడీఏ కాంపాటి మల్లయ్య బుధవారం పరిశీలించారు. పంటలకు కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, ఎండాకు తెగులు సోకినట్లు గుర్తించారు. తెగుళ్ల నివారణ చర్యలు సూచించారు. కాండం తొలిచే పురుగు నివారణకు కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కిలోల చొప్పున లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోల చొప్పున వేయాలని సూచించారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 100 గ్రాములు ఎకరాకు వారం వ్యవధిలో రెండు సార్లు స్ప్రే చేయాలని సూచించారు. ఎండాకు తెగులు నివారణకు ప్లాంటోమైసిన్ లేదా అగ్రిమైసిన్ స్ప్రే చేయాలని సూచించారు.

కబడ్డీ పోటీలు
మాక్లూర్: చిన్నాపూర్‌లో బుధవారం ఎంపీటీసీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు జరిగాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీల్లో గ్రామానికి చెందిన పలువురు కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్ట లక్ష్మీ, గంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం
కోటగిరి: కోటగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసి అందులో అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కంటి వైద్య నిపుణులు సతీష్ 20 మందికి వైద్య చికిత్సలు చేశారు. మోతి బిందు ఉన్న వారికి ఆపరేషన్ నిమిత్తం బోధన్ లయన్స్ క్లబ్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. శిబిరంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ సందీప్, లయన్స్ ప్రతినిధి గోగినేని హన్మంత్ రావు పాల్గొన్నారు.

సన్మానం
బోధన్: కుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన దొడ్ల రవీందర్ రెడ్డి ఇటీవల యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం హున్సా సొసైటీలో , కాంగ్రెస్ కిసాన్ కేత్ మండలాధ్యక్షుడు, సొసైటీ ఛైర్మన్ మందర్న రవి ఆధ్వర్యంలో రవీందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. సొసైటీ వైస్ ఛైర్మన్ వినోద్ బాబా, మాజీ ఎంపీటీసీలు బాజే గంగారాం, చీల శంకర్, నాయకులు పాల్గొన్నారు.

చందూర్ విండో అధ్యక్షుడిగా ప్యారం అశోక్
రుద్రూర్ : చందూర్ సింగిల్ విండో అధ్యక్షుడిగా ప్యారం అశోక్‌ను బుధవారం విండో పాలక వర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు ఇటీవల విండో మాజీ అధ్యక్షుడు మాధవ రెడ్డి అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దీంతో సహకార అధికారి సత్యనారాయణ రావు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. 12 మంది డైరెక్టర్లు అనుకూలంగా ఉండటంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం విండో అధ్యక్షుడు ప్యారం అశోక్ మర్యాదపూర్వకంగా డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిని కలిశారు.

వార్షికోత్సవానికి షిర్డీ సాయి ఆలయం ముస్తాబు
కోటగిరి: పాతంగల్‌లో ప్రసిద్ధిగాంచిన షిర్డీ సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం నేడు జరుగనుంది. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ వేడుకల్లో మల్లన్నగిరి ఆశ్రమంలోని ఝరాసంఘం పీఠాధిపతి సద్గురు బస్వలింగ అవధూత మహారాజ్ తో పాటు అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

మరమ్మతులకు మోక్షమెప్పుడో..?

- పోచంపాడ్ కూడలి నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- పలు చోట్ల పని చేయని లైట్లు
- మరమ్మతులకు మంజూరు కాని నిధులు


మరమ్మతులకు నోచుకుని సెంట్రల్ లైట్లు

బాల్కొండ: పోచంపాడు కూడలి నుంచి ఎస్ఆర్ఎస్పీ వరకు గల సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు ఎప్పుడు చేస్తారోనని కాలనీ వాసులు ఎదురుచూస్తున్నారు. 2014లో అప్పటి ప్రభుత్వం రూ.60 లక్షల నిధులతో 88 స్తంభాలతో ప్రాజెక్ట్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి వాటి నిర్వహణకు నిధులు లేకపోవడంతో లైట్లు పూర్తిగా పాడైపోయాయి. లైట్లు పని చేయకపోవడంతో రోడ్డంతా అంధకారం అలుముకుంటోంది. మరమ్మతుల కోసం ప్రాజెక్ట్ అధికారులు రూ.28 లక్షల నిధులతో ప్రభుత్వానికి ఏడాది క్రితమే ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటికీ నిధులు మంజూరు కాలేదు. ఎప్పుడు మంజూరు చేస్తారో కూడా అర్థం కాని పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

తరుచూ రోడ్డు ప్రమాదాలు..
సెంట్రల్ లైట్లు వెలగకపోవడంతో రోడ్డుపై అంతా చీకటి ఉండటంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఒకరు, స్తంభానికి ఢీకొని మరొక కాలనీవాసి మృత్యువాత పడ్డారు. ఇంకా చాలా మంది ప్రమాదాల బారిన పడి గాయాలపాలయ్యారు. మరిన్ని ప్రమాదాలు సంభవించక ముందే పాలకులు, ఉన్నత అధికారులు నిధులు మంజూరు చేయించి, మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..
సెంట్రల్ లైటింగ్ లైట్ల మరమ్మతుల కోసం రూ.28 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
– అక్తర్, ఏఈఈ, ఎస్సారెస్పీ

మంత్రిని విమర్శించే హక్కు లేదు


కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

కమ్మర్‌పల్లి/బాల్కొండ/మోర్తాడ్: పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తానని బూటకపు హామీఇచ్చి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఎంపీ అర్వింద్‌కు అభివృద్ధే ఎజెండాగా విధులు నిర్వర్తిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని విమర్శించే హక్కు లేదని కమ్మర్‌పల్లి, బాల్కొండ మండలాల బీఆర్ఎస్ నేతలు, మోర్తాడ్ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం కమ్మర్‌పల్లి, బాల్కొండ, మోర్తాడ్ మండల కేంద్రాల్లో వేర్వేరుగా మాట్లాడారు. మంత్రి వేములను దూషిస్తూ ఎంపీ అర్వింద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎంపీ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో చేసిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.చిల్లర రాజకీయాలు మానుకుని ప్రజలు సేవ చేయాలని హితవు పలికారు.

సమష్టి పోరాటంతో జిల్లా సాధించుకుందాం


దీక్షలో కూర్చున్న అసోసియేషన్ ప్రతినిధులు

బోధన్: సమష్టి పోరాటంతో బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా సాధించుకుందామని పలువురు న్యాయవాదులన్నారు. బోధన్ జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 38వ రోజుకు చేరాయి. దీక్షలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ గవర్నమెంట్ లైసెన్స్‌డ్ వైర్ మెన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు కూర్చున్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ రవితేజ

ఎడపల్లి(బోధన్): మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పిల్లల్లో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై జానకంపేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా జిల్లా మానసిక ఆరోగ్య అధికారి రవితేజ పాల్గొని మాట్లాడారు. పిల్లలు పొగాకు, గంజాయి, ఆల్కహాల్ తదితర మత్తు పదార్థాలు వాడడం వల్ల మానసిక సమతౌల్యం దెబ్బతింటుందన్నారు. విశిష్ట అతిథి జువైనల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు రమణ మాట్లాడుతూ.. పిల్లలు మొబైల్స్ వాడడం తక్కువ చేసి ఆటలు ఆడటం ఎక్కువ చేయాలని కోరారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్యకుమార్, బాల రక్షభవన్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి, ఎక్సైజ్ ఎస్సై బాలయ్య, ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నవీపేట(బోధన్): సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి ఆధ్వర్యంలో ఏజెన్సీ కార్మికులు బుధవారం నవీపేట తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి మాట్లాడుతూ.. సీఎం నిండు అసెంబ్లీలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3 వేల వేతనం ఇస్తానని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటికి అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చిన్నపిల్లలకు అందించే పౌష్టికాహారం కోడిగుడ్లను నేరుగా ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు.

సెలవులు ఉపాధ్యాయుల ప్రాథమిక హక్కు

భీమ్‌గల్: ఉపాధ్యాయులకు సెలవులు మంజూరూ చేయొద్దంటూ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వులను ఖండిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్దన్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మల్క జనార్దన్ మాట్లాడుతూ.. ప్రమోషన్ల పేరుతో ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వరాదని ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. వ్యక్తిగత అవసరాలు, ఆరోగ్య సమస్యలు ఉన్న సమయంలో సెలవులు వాడుకోవాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. ఉత్తర్వులు ఉపసంహరించుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పీఆర్టీయూ కార్యవర్గం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆలూర్ మండల అధ్యక్షుడిగా భోజన్న, ప్రధాన కార్యదర్శిగా అశ్పాక్ అహ్మద్, గౌరవ అధ్యక్షుడిగా డీకే జగదీశ్వర్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్ రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కిషన్, మహిళ కార్యదర్శిగా సుమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని మోహన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. పీఆర్టీయూ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పటేల్, ఆర్మూర్ మండల అధ్యక్షుడు ఇట్టం గోపాల్, హెచ్ఎంలు కుంట శ్రీనివాస్ రెడ్డి, హరిత పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు


సాయితేజను అభినందిస్తున్న కలెక్టర్

బోధన్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కేంద్రంలోని పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రాకాసీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ) 10వ తరగతి విద్యార్థి సాయితేజ ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచాడు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణ రెడ్డి, సీపీ నాగరాజు, అదనపు జాయింట్ కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్ర మిశ్రాలు సాయి తేజకు బహుమతి అందించి అభినందించారు. పాఠశాలలో హెచ్ఎం రాజేశ్వర్ శర్మ, ఉపాధ్యాయులు నగేష్ బాబు, ఈశ్వర్, సునీత్ కుమార్, డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్ లింబూరి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.
పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ మోడల్ స్కూల్‌కు చెందిన భోగ జావలి వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇటీవల విద్యా శాఖ ఆధ్వర్యంలో 'హౌ టు ఎలెక్ట్ ట్రూ లీడర్' అనే అంశంపై ఆర్మూర్ నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లా కేంద్రంలో కలెక్టర్ నారాయణ రెడ్డి, జావలికి బహుమతిని అందజేశారు.

సమాచారం..

నేడు సీపీఐ సభ్యత్వ నమోదు
ఆర్మూర్: పట్టణంలో సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఐ ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి సాయిలు తెలిపారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు
ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శాస్త్రినగర్ జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదమం అమ్మవారికి అభిషేకం, 10 గంటల వరకు అక్షరాభ్యాసం ఉంటుందన్నారు. ఆలయాన్ని విద్యుత్‌కాంతులలో అందంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సభ్యులు పేర్కొన్నారు.

వార్డు సమస్యల్ని పరిష్కరించండి


కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న కౌన్సిలర్

బోధన్‌టౌన్(బోధన్): మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌ను కౌన్సిలర్ ధూప్‌సింగ్ కోరారు. బుధవారం ఆయన 4వ వార్డులో పర్యటించారు. వార్డులోని తాగునీటి, పారిశుధ్య, ఇతర సమస్యలు ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని వార్డు వాసులు కోరారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
బోధన్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని తీర్‌గల్లీ, గాంధీనగర్, శక్కర్‌నగర్, ఆచన్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ఏఈలు శ్రీనివాస్, శివకృష్ణ ఉన్నారు.

కాలినడకన బాసరకు భక్తులు



రెంజల్(బోధన్): కామారెడ్డి జిల్లాకు చెందిన భక్తులు కాలినడకన నిర్మల్ జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం బాసరకు బయలుదేరారు. గురువారం బాసర సరస్వతి అమ్మవారి జయంతి(శ్రీ పంచమి) సందర్భంగా ప్రతీ సంవత్సరం భక్తులు కాలినడకన అమ్మవారి దర్శనానికి తరలివెళ్తుంటారు. కామారెడ్డి జిల్లా నుంచి బోధన్, రెంజల్, నవీపేట్ మండలాల మీదుగా బాసరకు చేరుకుంటామని భక్తులు తెలిపారు. కోరిన కోర్కెలు తీరుతుండటంతో ప్రతి ఏడాది కాలినడన బాసరకు చేరుకుంటామని భక్తులు వివరించారు. మరుసటి రోజు వసంతి పంచమి పండుగ వేడుకల్లో పాల్గొని తిరిగి వాహనాల ద్వారా ఇంటికి చేరుకుంటామని వివరించారు.

కొనసాగుతున్న శుక్రవారం దేవి ఉత్సవాలు


ఆలయంలో రుద్రయాగం నిర్వహిస్తున్న భక్తులు

కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లోని శుక్రవారం దేవి ఆలయంలో ఉత్సవాలు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి రుద్రయాగం, సహస్ర పుష్పార్చన తదితర కార్యక్రమాలను పురోహితులు కృష్ణ, శ్రీనివాస్, రఘు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ దాతలు పోలీస్ విద్యాసాగర్, లావణ్య దంపతులు, రాములు, నారాయణ, దేవి దీక్షాపరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ
నవీపేట: యంచ గ్రామంలోని శ్రీ ఓం జగదాద్రి ఆశ్రమంలో కామధేను విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆలయ వ్యవస్థాపకులు స్వర్ణ కమల లక్ష్మి బుధవారం భూమి పూజ చేశారు. కామధేనువును పూజిస్తే సకల సంపదలు సిద్ధిస్తాయని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లహరి ప్రవీణ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రాజ్, జానకంపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ విజయ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీ ఛైర్మన్

నందిపేట్(ఆర్మూర్): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నందిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ముందుగా ఆంధ్రనగర్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. ఎంపీడీవో నాగవర్ధన్, సర్పంచులు సంబారు వాణి, నాయుడు రామారావు, రామడ పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

పండుగలా కంటి వెలుగు..
ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ఓ పండుగలా కొనసాగుతుందని మున్సిపల్ ఛైర్మన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 36, 5, 2వ వార్డుల్లో బుధవారం కంటి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అంధత్వ రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్ బండారి ప్రసాద్, బి.రమేష్, ఆరోగ్యశాఖ అధికారులు అయేషా, చంద్రశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను ఆపాలని వినతి


వినతి పత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

నవీపేట: మండల కేంద్రంలోని బాసర క్రాసింగ్ శివాజీ నగర్ సమీపంలో ఆర్టీసీ బస్సులను ఆపాలని కోరుతూ ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు బుధవారం బీఆర్ఎస్ నేతలు వినతి పత్రం సమర్పించారు. రూ. 5 లక్షల వ్యయంతో రిక్వెస్ట్ స్టాప్‌ను నిర్మించామని, కానీ ఆర్టీసీ బస్సులను ఆపడం లేదని ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన డీఎంకు ఫోన్‌చేసి బస్సును ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నాళేశ్వర్ నుంచి నిజామాబాద్‌కు వయా నవీపేట మీదు గా ఉదయం, సాయంత్రం వేళలో బస్సు సౌకర్యం కల్పించాలని నాళేశ్వర్ గ్రామస్తులు ఛైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకులు నర్సింగ్‌రావ్, తెడ్డు పోశెట్టి, రాంరెడ్డి, సూరిబాబు, సాయరెడ్డి ఉన్నారు.

రైతులు అభివృద్ధి చెందడమే లక్ష్యం


పనులు ప్రారంభిస్తున్న ఛైర్మన్ వీఆర్ దేశాయ్

రెంజల్(బోధన్): రైతులు అభివృద్ధి చెందడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని బోధన్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వీఆర్ దేశాయ్ అన్నారు. ఎమ్మెల్యే షకీల్ ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ నిధుల నుంచి రెంజల్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగి నుంచి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు, అసంపూర్తిగా మిగిలిన ప్రహరీ గోడ నిర్మాణ పనులకు రూ.30 లక్షలను మంజూరు చేశారు. బుధవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పనులను ప్రారంభించి ఛైర్మన్ మాట్లాడారు. నిర్మాణ పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జెడ్పీటీసీలు మేక విజయ, గిర్దావర్ గంగారెడ్డి, సర్పంచ్‌లు మర్ల రమేశ్ కుమార్, ఎఖార్‌పాష, విండో ఛైర్మన్ ఇమాంబేగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం


బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ వరప్రసాద్


ఆర్మూర్ పట్టణంలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పండిత్ వినీత, ఆర్డీవో శ్రీనివాసులు


కమ్మర్‌పల్లి: మాక్ పోలింగ్‌లో భాగంగా ఓటు వేస్తున్న కేజీబీవీ విద్యార్థులు

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, పట్టణాలలో విద్యార్థులతో కలిసి ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించారు. ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో సరైన అభ్యర్థిని నాయకుడిగా ఎన్నుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీల వద్ద ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాలెంలో ..


కోటగిరి రెవెన్యూ ఆఫీస్‌లో.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


చిట్టాపూర్‌లో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బాల్కొండ: చిట్టాపూర్‌లో సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అన్నదానం ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు..
గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన అన్నదానం ఉంటుందన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
మెండోరా మండల కేంద్రంలో కల్యాణ వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలు బుధవారం కొనసాగాయి. గురువారం ముత్యాల తలంబ్రాలతో సతీసమేతంగా స్వామి వారికి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. అలాగే ముప్కాల్ మండలం వేంపల్లిలో వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం నవగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు, వీరాజంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన, అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూదన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంబాబ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776 & బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ వి. మల్లిఖార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899